## క్లుప్తంగా

### పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాల్లో 37 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఆయా పోలింగ్ బూత్‌లకు వేసిన నంబర్లను పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ గంగాధర్ తదితరులు ఉన్నారు.

### గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పరిశీలన



జీపీ భవనం పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో ప్రభు పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామంతో పాటు కోమటి కొండాపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎక్కడ కూడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శులు రాకేశ్, కవిత పాల్గొన్నారు.

### అసెంబ్లీ ఎన్నికలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాయికల్: నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికలపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులతో, ఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంఈవో గంగాధర్ పాల్గొన్నారు.

### పర్యావరణంపై అవగాహన ఉండాలి



విద్యార్థులను అభినందిస్తున్న సత్యనారాయణ

జగిత్యాల: విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహనతో పాటు, మెలకువలు సాధించాలని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. శనివారం హరిత గణాంక సూచిలో ప్రశంసా పత్రాలు, గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదేనని అన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన గణాంక సూచిలలో జగిత్యాల కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఆడిట్‌సెల్ కన్వీనర్ జ్యోతిలక్ష్మి, సభ్యులు మానస, వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, డాక్టర్ పదాల తిరుపతి పాల్గొన్నారు.

### విజేతకు బైక్ అందజేత



విజేతకు బైక్ తాళాలు అందిస్తున్న ఎస్సై అశోక్

మల్యాల: మండల కేంద్రంలోని నవ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లాటరీలో విజేతగా సర్వాపూర్ గ్రామ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి నిలువగా, మల్యాల ఎస్సై తీగల అశోక్ విజేతకు బైక్ అందజేశారు. కార్యక్రమంలో బొట్ల ప్రసాద్, బేతి రవి,జనగం రాములు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతుకు మోక్షమెప్పుడో?



సారంగాపూర్: సారంగాపూర్–బట్టపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. సారంగాపూర్ నుంచి పోతారం మీదుగా బట్టపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. 4 కిలోమీటర్ల తారు రోడ్డు అడుగడుగున గుంతలు, కంకర తేలి కనీసం నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు మొత్తం శిథిలమైపోయిందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వెంటనే మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పెగడపల్లి: మండలకేంద్రం నుంచి నందగిరి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న విరిగిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. విరిగిన స్తంభం తొలగించి కొత్త స్తంభం వేయాల్సిన ట్రాన్స్‌కో అధికారులు స్తంభం చుట్టూ మట్టి పోసి కప్పేశారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే దారిలో స్తంభం విరిగిపోయి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బాటసారులు, వాహనదారులు భయపడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి విరిగిన స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

మల్లాపూర్: రామాయణ గ్రంథకర్త, ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మండలం కేంద్రంతో పాటు వెంకట్రావ్‌పేటలో మహర్షి వాల్మీకి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ గ్రంథకర్త, ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని స్వరాష్ట్రంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. కాగా వెంకట్రావ్‌పేటలో నిర్వహించిన వాల్మీకి జయంతి ఉత్సవాలలో ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడీ కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, సీఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు అన్నదానం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగుల మమత, ఎంపీటీసీ తోట సుజాత, బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచుల నర్సయ్య, వీవీరావుపేట గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు పెనుకుల అశోక్, నాయకులు పాల్గొన్నారు.

**భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో..**

జగిత్యాలటౌన్: భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆక్కినపెల్లి కాశీనాథం, గంధ్ర ప్రవీణ్‌రావు, సిరిపురం గంగారాం, వేముల పోచమల్లు, బందాలి మల్లికార్జున్, కస్తూరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

**వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి**

గొల్లపల్లి: రామాయణ రచయిత వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బోయ వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంది వెంకటేశం, భీంరాజ్‌పల్లి గ్రామ అధ్యక్షుడు బొమ్మెన వెంకటేశం అన్నారు. మండలంలోని భీంరాజ్‌పల్లిలో వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారత సాహిత్యానికి ఆద్యుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామాయణాన్ని అందించిన వాల్మీకి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. తెలుగు ప్రభుత్వాలు ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశాన్ని కేంద్రంతో మాట్లాడి పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంది సత్తయ్య, ప్రధాన కార్యదర్శి తక్కల లచ్చన్న, ఉప సర్పంచ్ దూస రవి, నాయకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పెగడపల్లి: మండలంలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. వరికోతలు చేపట్టి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెడుతున్న రైతులు కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారు. తేమ శాతం రావడం కోసం పొద్దంతా ధాన్యం ఆరబెట్టి రాత్రి సమయంలో కుప్పగా పోస్తున్నారు. అయితే కేంద్రాలు ప్రారంభించక పోవడంతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు, కుప్పలపై కప్పేందుకు కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు ఇవ్వక పోవడంతో రైతులే అద్దెకు తెచ్చుకుంటున్నారు. దీంతో కవర్ల అద్దె తడిసి మోపడవుతోందని రైతులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### మద్దతు ధర అందించడానికే కొనుగోలు కేంద్రాలు

మెట్‌పల్లి: మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అందించడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మార్క్‌ఫెడ్ డీఎంవో ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2090 మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులు పంటను తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించకుండా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం దివ్య భారతి, కార్యదర్శి రమణ, జెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### చిరుధాన్యాలపై క్షేత్రప్రదర్శన

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శనివారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో దాసార వేణురావు సాగు చేసిన చిరుధాన్యం పంటలు జొన్న, రాగి పంటలను రైతులు సందర్శించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం – 2023 సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు చిరుధాన్యాలను ప్రోత్సహించేందుకు జొన్నలు, రాగులు, సజ్జల విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పంట చేతికి రావడంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రజనిదేవి, స్వాతి మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల ఇతర పంటలకంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా ఉపయోగించడం వల్ల కూడా ఆస్పత్రులకు వెళ్లకుండా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అల్లీపూర్ రైతు సొసైటీ అధ్యక్షుడు అత్తినేని శంకర్, రైతులు భీమరాజు, రాకేశ్, రాజలింగం పాల్గొన్నారు.

### బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్

ఇబ్రహీంపట్నం: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్ యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నిజామాబాద్ పార్లమెంట్ కో–కన్వీనర్ సదాశివ్ శనివారం అందజేశారు. వెంకటేశ్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

### ప్లంబర్లకు టూల్ కిట్లు అందజేత

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్, ప్లంబర్లకు శనివారం సంఘం అధ్యక్షుడు జావీద్ స్వంత ఖర్చులతో టూల్ కిట్ బ్యాగులు అందజేశారు. సుమారు 200 మందికి వీటిని పంపిణీ చేశారు. గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం వీటిని అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అజీజుల్లా, రవి, అబిద్, మాజిద్, రాహుల్ పాల్గొన్నారు.

### 'మేడిగడ్డ పిల్లర్ల ఘటనపై కేంద్రం విచారణ జరపాలి'

మెట్‌పల్లి: మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నప్పటికీ ఇంతకాలం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్రం ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి నష్టానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

జగిత్యాలటౌన్: జిల్లా స్థాయి పాఠశాలల అండర్–14,అండర్– 17 బాలబాలికల త్రోబాల్, చెస్, క్యారం, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు శనివారం జగిత్యాల వివేకానంద మినీస్టేడియంలో జరిగాయి. బాలుర విభాగంలో 153, బాలికల విభాగంలో 105 మంది పాల్గొన్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, కరాటే కోచ్ శ్రీనివాస్, పీఈటీలు క్రిష్ణప్రసాద్, రవి, అజయ్‌బాబు, సాగర్, భాస్కర్, వెంకటలక్ష్మి, జమునారాణి తదితరులు పాల్గొన్నారు.

### బాధితుడి వైద్యం కోసం ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన కదారి రాజు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, వైద్యం కోసం కథలాపూర్ దుబాయి సంఘం సభ్యులు రూ. 30 వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. రాజు నిరుపేద కావడంతో వైద్యం కోసం డబ్బులు లేక తల్లడిల్లుతున్నారని తెలిసి ఆర్థికసాయం అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కల్లెడ మోహన్, తాలుకా మల్లేశ్, కల్లెడ సాయి, పూండ్ర జీవన్, రాజేందర్‌రావు, గణేశ్ పాల్గొన్నారు.

### ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ స్వామివారు ప్రత్యేక పూజలు అందుకుని రథంపై ఆశీనులయ్యారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం జరిగింది. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో సర్పంచ్ పోతు సింధూజ, అర్చకులు మాధవచారి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరికలు

జగిత్యాల: సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ అన్నారు. శనివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు మాజీ మంత్రి రాజేశం గౌడ్, కౌన్సిలర్ కూసరి అనిల్ పాల్గొన్నారు.

**ప్రచార రథం ప్రారంభం**

బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం కోసం కౌన్సిలర్ శివకేసరి బాబు తయారు చేయించిన ఎన్నికల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట కార్యకర్తలు పాల్గొన్నారు.

### కళాశాల మైదానంలో సీఎం సభ రద్దు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న సీఎం సభను రద్దు చేయాలని కోరుతూ ధర్మపురికి చెందిన యువకులు మహిపాల్, కోస్నూర్‌పల్లెకు చెందిన విక్రమ్‌రెడ్డి శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకరకు వినతి పత్రం అందజేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంలు భద్ర పరిచిందని, నవంబర్ 2న సీఎం కేసీఆర్ అదే ప్రభుత్వ కళాశాల మైదానంలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఈవీఎంలు ఉన్నచోట సీఎం సభను ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారని, కళాశాల మైదానం కాకుండా మరో చోట సభను ఏర్పాటు చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## కొండ్రికర్లలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.బీఆర్‌ఎస్సే మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. అంతకుముందు సంజయ్ గెలవు కోసం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిరెడ్డి,బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి,నాయకులు చంద్రయ్యగౌడ్,సత్యనారాయణగౌడ్,రమేశ్, నర్సయ్య, చిన్న గాంధారి, రవిగౌడ్, ఎర్రన్న, అశోక్ పాల్గొన్నారు.

### పెగడపల్లిలో ..



ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జంగ్ తెలంగాణ

పెగడపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని మండల కేంద్రం లో పార్టీ నాయకులు శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి ఈశ్వర్‌ను అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, కరుణాకర్‌రావు, స్వామి, రాజు, ప్రవీణ్‌రావు, లోకేశ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, సురేశ్, పద్మ, జమున, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు



ప్రచారం చేస్తున్న హరిచరణ్ రావు, నాయకులు

మేడిపల్లి: మండలంలోని వల్లంపల్లి, కల్వకోట, కాచారం గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో చల్మెడ లక్ష్మీనరసింహరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హరిచరణ్‌రావు, వెల్మా సమత, నాయిని మమత, సత్తిరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



నందగిరిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని మ్యావెంకయ్యపల్లి, నర్సింహానిపేట గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీం కార్డులు పంపిణీ చేయడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలు రూ. 500 లకే సిలిండర్, పింఛన్ రూ. 4 వేలు, ఇందిరమ్మ ఇంటికి రూ. 5 లక్షలు, రూ. 2 లక్షలు రుణమాఫీ, రూ. 15 వేలు రైతుబంధు, నిరుద్యోగ పెన్షన్ తదితర పథకాలను ఓటర్లను వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటేసి లక్ష్మణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాములుగౌడ్, శ్రీనివాస్, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, రవి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### దేశాయిపేటలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



దేశాయిపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట లో గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో ఏలేటి మహేశ్, కొప్పెర జగన్, తిరుపతిరెడ్డి, దిలీప్, మహేశ్ రెడ్డి, శ్రావణ్, జలందర్, లచ్చిరెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

## ఖతార్‌లో జువ్వాడి అభిమానుల సంబరాలు



స్వీట్లు పంచుకుంటున్న జువ్వాడి అభిమానులు

కోరుట్ల: కోరుట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జువ్వాడి నర్సింగరావును ప్రకటించటంతో గల్ఫ్ దేశం ఖతార్‌లో జువ్వాడి అభిమానులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖతార్‌లో జువ్వాడి అభిమాని మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జువ్వాడి నర్సింగరావు సేవలను గుర్తించిన కాంగ్రెస్ ఆదిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించటం సరైన నిర్ణయం అన్నారు. కార్యక్రమంలో మనోహర్, సతీశ్, రాహిల్ ఖాన్, యాసిన్, రమేష్, చిరంజీవి, ఖాజా,రాజన్, దావా, ఫరాజ్, బిషాల్‌రాయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

### వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాశ్‌రావు,దీప

కథలాపూర్: గ్రామీణ ప్రజలు తాగేందుకు మంచి నీరు అందించాలనే తమ సంస్థ ద్వారా మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశామని ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాశ్‌రావు– దీప అన్నారు. శనివారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో ప్రతిమ ఫౌండేషన్ ద్వారా నెలకొల్పిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. గ్రామస్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నామన్నారు. అంతకుముందు తక్కళ్లపెల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతు సింధూజ, బీజేపీ మండలాధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, ఖద్రి సత్యం, మల్యాల మారుతి, అంజయ్య, ప్రవీణ్, ప్రతాప్, వినోద్, జనార్దన్ పాల్గొన్నారు.

### మోహన్‌రావుపేటలో నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ పంచిరి విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అరవింద్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.